# ముష్టిముఖం !



అద్దంలో నాముఖాన్ని చూసుకుని అదిరిపడ్డాను...! అద్దంలో ముఖానికి, నా అసలు ముఖానికి... అసలు పోలికే లేదు... నాకు చాలా ఆనందంగా ఉంది... ఆశ్చర్యంగా ఉంది. అరగంట క్రితం నేను బజారులో నాముఖాన్ని మార్చుకుని, ముష్టిముఖాన్ని తగిలించుకున్నాను...!

నా ముష్టిముఖంతో బజారులో నడుస్తుంటే నన్ను అందరూ వింతగా చూసినవాళ్ళే ! ముష్టిముఖంతో ముందుగా నేను కిరాణా కొట్టుకు వెళ్ళాను. కొట్లో పదికేజీల బియ్యం, సామాన్లు

తీసుకుని ఇంటికి వచ్చిపడ్డాను. వంటగదిలో సామాన్లు పడేశాను... నాగదిలోకి వచ్చి అద్దం ముందు నిలబడ్డాను...!

నేను ఇంటికిరావడం, నా భార్య అలివేలు ఇంకా గమనించినట్టులేదు... పెరట్లో పక్కింటి పిన్నిగారితో తీరిగ్గా కబుర్లు చెబుతూంది. ఆ కబుర్లకు అంతూపొంతూ లేదు... ప్రవాహంలా అలా సాగుతూనే ఉన్నాయి...!

ఇంతకూ నేను ముఖం మార్చుకోవడం, ముష్టి ముఖాన్ని తగిలించుకోవడం మీకు అర్థం కాలేదు కదూ ! అర్థం కాకపోవడానికి ఏముందండీ ! నా ముఖం ఒక ప్రశ్నార్థకం ? నాముఖం చూసిన వాళ్ళెవరికి సదభిప్రాయం కలగదుట...! నా ముఖంలో పెద్దలోపం ఉందట ! ఈ మాటలన్నది ఎవరోకాదు... అగ్నిసాక్షిగా నేను పెళ్ళిచేసుకున్న నా అర్ధాంగి అలివేలే ! అందుకే ఈ బాధంతా !!

నాముఖంలో లోపం మీకు చెప్పాలి కదూ ! నా ముఖం ఎప్పుడూ బిగుసుకుపోయినట్లుగా ఉంటుంది... బాధ, భయం, సుఖం, దుఃఖం లాంటి భావాల్ని అంత త్వరగా వ్యక్తీకరించదు... ఇక, నవ్వు నాముఖంలో కాగడాపెట్టి వెతికినా కనిపించదు...! మౌనంగా నా పని నేను చేసుకుపోవడం తప్ప ఒకరితో ఎక్కువగా మాట్లాను. ఎందుకో మాట్లాడాలనిపించదు... నేను ఎవరికీ నమస్కారం పెట్టను... నాకు బానిస ప్రవృత్తి అంటే బొత్తిగా కిట్టదు... ఒకరి దగ్గర చేయిసాచను... అభిమానం చంపుకోను... ఆత్మవంచన చేసుకోను... ద్వంద్వ వైఖరి నాకు తెలియదు... రెండు నాల్కల ధోరణితో తమను తాము మోసం చేసుకుంటూ, ఎదుటివాళ్ళని మోసం చేయడం నాకు నచ్చదు... కానీ, ఇప్పుడు నేను నాముఖాన్ని మార్చుకోవలసి వచ్చింది... ముష్టిముఖాన్ని తగిలించుకోవాల్సి వచ్చింది... అసలు నాముఖాన్ని మార్చుకునే అవసరం ఎలా వచ్చిందంటే...

గతవారం రోజులుగా, బంధువులు ఒకళ్ళ తరువాత ఒకళ్ళు వచ్చి ఇల్లు గుల్ల చేసి వెళ్ళారు. ఇంట్లో వెచ్చాలు, బియ్యంతో సహా అన్నీ నిండు కున్నాయి... శ్రీమతి సరుకుల లిష్టురాసి నా చేతిలో పెట్టింది. నెలాఖరు రోజులు... జేబులు ఖాళీ...! ఇంట్లోకి బియ్యం, సరుకులు తీసుకురావాలి... ఇల్లాలు వంట చేయాలి... నేను భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళాలి... అయినా ధైర్యం కూడగట్టుకుని షాహుకారు కొట్టుకు వెళ్ళాను... అతను నాముఖం వంక అదోలా చూశాడు.

"ప్రతినెలా మీది అయిదొందలకు పైగా బాకీ ఉండిపోతంది... సరుకులు ఇవ్వడం కుదర్దు ! వెళ్ళండి !"

నేను వెళ్ళలేదు... అక్కడే నిలబడ్డాను...

"సరుకులివ్వడం కుదరదా...? ఏం...? నీ బాకీతో ఊరొదిలిపోతాననుకున్నావా...? అయినా ప్రతినెలా పూర్తిగా బాకీ జమకడుతున్నాను కదా ! అయిదొందలు బాకీ ఉండిపోయిందంటే... అది నువ్వు పెంచిన ధరల విశ్వరూపమే ! దోచుకోవడం, దాచుకోవడం తప్ప మనుషుల అవసరాలు నీకు అర్థం కావు... పందికొక్కులు నీకంటే నయం... నీ ఆశకు అంతులేదు. అవకాశం ఉంటే ఈ వూరిని ఊళ్ళోని మనుషుల్ని కూడా మింగేస్తావు... అందుకే ఆబొజ్జని అలా అడ్డంగా పెంచేస్తున్నావు... ఎప్పుడో నీపాపం పండుతుంది !"

'ఏటండీ ! అలా చూస్తున్నారు... ఆచూపేం టి? ఆముఖం ఏంటి...? సరుకులివ్వడం కుదరదు...' షాహుకారు మళ్ళీ తన బొంగురు గొంతువిప్పి ఖచ్చితంగా చెప్పాడు... నేను నిరాశగా వెనక్కి తిరిగాను. ఏంచెయ్యను...?

ఓ ప్రయివేటు సంస్థలో సామాన్య గుమా స్తాని... కోతలన్నీపోగా చేతికి వచ్చే పరిమిత జీతంతో, అగ్గిపెట్టెలాంటి అద్దె ఇంట్లో, ముగ్గురు పిల్లలతో ఈ మండిపోయేధరల రోజుల్లో సంసారాన్ని గుట్టుగా నెట్టుకురావడం కత్తిమీద సామేకదా !

"ముంగిలా మొహం పెట్టుకుని, ఏదో శాపం పెట్టినట్లుగా చూపులు చూస్తాడేంటి ? మనం భయపడిపోవాలనా...?" కొట్లో కుర్రాడితో

షాహుకారు అంటోన్న మాటలు నాచెవిన పడ్డాయి... నేను వెనక్కి తిరిగి చూడలేదు... నీరసంగా ఇంటికి తిరిగి వచ్చాను.

చేతిలో ఖాళీ సంచి చూసి, అలివేలు నామీద విరుచుకుపడింది !"కిరాణాకొట్లో సామాన్లు తీసుకురాలేని వాళ్ళు మీరెందుకు పనికొస్తారండీ...? నన్నెందుకు పెళ్ళిచేసుకున్నారు...? ముగ్గురు పిల్లల్ని ఎందుకు కన్నారు ? షాహుకారు అరువివ్వనంటే ముఖం వేలాడేసుకుని వచ్చేయడమే ? బ్రతిమాలో, బామాలో సామాన్లు తీసుకురావొద్దూ !"

"బ్రతిమాలటం, బామాలటం నాకు చేతకాదు మరి...!" నాలో నేను గొణుక్కున్నాను. అలివేలు ఒక్కక్షణం ఆగి నాముఖంలోకి చూసి అంది ! "అయినా మీ ముఖానికి అప్పూ అరువూ పుట్టవేమో!' నా ముఖాన్ని ముఖవైనాన్ని అలివేలు చాలాసార్లు వ్యాఖ్యానించింది.

నాకు పౌరుషం వచ్చింది...ఉక్రోషం పెరిగింది... ఖాళీ సంచితో తిరిగి బజారులోకి వచ్చాను. నాలుగురోడ్ల జంక్షనులో నిలబడ్డాను... అయోమయంగా... వచ్చీ పోయేవాళ్ళనీ, వాహనాల్నీ చూస్తున్నాను.

జనప్రవాహం తమ తమ దైనందిన తాపత్రాయాల పరుగుల్లో కదిలిపోతూంది ! "అయ్యా! ధర్మం సెయ్యండి !" ఉలిక్కిపడి ప్రక్కకు తిరిగాను. నావైపు చేయిసాచి దీనంగా ఒక ముష్టివాడు... జేబులో పదిపైసలు వాడి బొచ్చెలో వేశాను. వాడు నాకు దణ్ణం పెట్టాడు.. నన్ను దాటి ముందుకు పోతున్నాడు... నా మెదడులో ఏదో మెరుపు మెరిసినట్లయింది...!

"ఏయ్ ! నిన్నే ఇలారా !" వాడిని పిలిచాను.

"ఏటి బాబూ...?" ముష్టివాడు నాముందుకు వచ్చి నిలబడ్డాడు.

"ఏంలేదు... మనిద్దరం, ఒకరి ముఖం ఒకరికి మార్చుకుందామా...?"

"అదేటి బాబూ ! మీ మొకం అందంగానే ఉంది కదా !"

"అందం గురించి కాదులే... నీముఖం నాకు కావాలి..."

"అలాగేనయ్యా ! నాకూ ఈ మొకంతో మొఖం మొత్తేసినాది..."

"ముష్టివాడు తనముఖాన్ని నాకిచ్చి నాముఖాన్ని వాడు పెట్టుకుని సంతోషంగా వెళ్ళిపోయాడు... నేను ముష్టివాడి ముఖాన్ని తగిలించుకున్నాను. నాకు ఒళ్ళు జలదరించి నట్లయింది. అంతేకాదు. ముష్టివాడి ముఖాన్ని తగిలించుకోగానే విచిత్రంగా, నామాట, మనస్తత్వం, తీరు, ఆలోచన అన్నిట్లోనూ మార్పు వచ్చింది. నాలో నాకే ఆశ్చర్యమనిపించింది...!

తిన్నగా కిరాణా కొట్లోకి వెళ్ళాను... మళ్ళీ ఎందుకొచ్చావు అన్నట్లుగా నాముష్టిముఖంలోకి చూసి ముఖం చిట్లించాడు షాహుకార్లు నేను అదేమి పట్టించుకోలేదు.

"అయ్యా ! షాహుకారు మహాశయా ! మీరు లక్ష్మీపుత్రులు... దయాగుణ సంపన్నులు... దానకర్ణులు మీరు కినుక వహిస్తే నాలాంటి సగటు మనిషికి దిక్కెవరు? ఈ నెలాఖరు రోజుల్లో మీరు సరుకులివ్వకపోతే, పిల్లలతో సహా అందరం పస్తులుండాల్సిందే...! మా అవసరాలు తీర్చే ఆపద్బాంధవులు మీరే కదా ! మీ బాకీ ఎక్కడికిపోతుందండీ...? వచ్చే నెలలో బోనస్ రాగానే జమకట్టనూ...? ఈ సారికి సరుకులిచ్చి పుణ్యం కట్టుకోండి... అన్యథాశరణం...నాస్తి... అయ్యా ! బాబూ !"

షాహుకారు నా ముష్టిముఖంలోకి పరీక్షగా చూశాడు... ప్రాథేయపడుతూన్న నాస్వరం..., వెన్నెముక ఒంగిపోయినట్లుగా, నిలబడ్డ నా ఆకారం... ఏమనుకున్నాడో షాహుకారు సరుకులిమ్మని కుర్రాడ్ని ఆదేశించాడు... నాకెంతో గర్వంగా అనిపించింది. ముష్టిముఖంతో నేను సాధించిన మొదటి విజయమిది...

సరుకులు తీసుకుని ఉరుకూ పరుగులతో ఇంటికి తిరిగి వచ్చేశాను...! "ఏవండీ ! బజారు

నుంచి వచ్చేశారా...? అబ్బో ! బియ్యం, సరుకులూ కూడా తెచ్చారే ! అరువు ఇవ్వకనన్న షాహుకారు ఎలా ఇచ్చాడండీ మళ్ళీ ? ఏమైతేనేం ఇన్నాళ్ళకు ఇంట్లో మగాడిగా ఒకపని చేసుకొచ్చారు !"

వంట గదిలోంచి అలివేలు మాటలు వినబడుతున్నాయి...! అద్దం ముందు నిలబడ్డ నేను హడావుడిగా బట్టలు మార్చుకున్నాను. ఆఫీసు ఫైలు ఒకటి చేతబట్టుకుని, ఆదరాబాదరాగా బయటపడ్డాను... "అదేంవిటండీ ! ఆఫీసుకెళ్ళిపోతున్నారా ? ఒక అరగంట ఆగండీ ! అన్నం వండేస్తాను... పచ్చడి వేసుకుని తినేద్దురుగాని...!" అలివేలు గుమ్మం వరకూ వచ్చి అరచింది... నేను ఆగలేదు. ఎందుకో ఆమెకు నాముష్టిముఖాన్ని చూపించటం ఇష్టంలేదు... సందులోంచి నడిచి రోడ్డు మీదకు వచ్చాను... కంగారుగా అడుగులు వేస్తున్నాను... కడుపు ఖాళీగా ఉంది... కల్పన థియేటరు సెంటరులో మలుపు తిరిగాను... ఎదురుగా ఉన్న ఉడిపి హోటలు చూడగానే ఆకలి మరింత ఎక్కువయింది... నాముష్టిముఖానికి జేబురుమాలు అడ్డం పెట్టుకుని తిన్నగా హోటలు లోపలికి వెళ్ళిపోయాను...

"ఏం కావాలి సార్" సర్వరు వచ్చి అడిగాడు.

"ఒక ప్లేటు సాంబారు ఇడ్లీ, ఒక ప్లేటు పూరీ, బ్రూకాఫీ స్ట్రాంగ్‌గా చేయించు !".

టేబిలు మీదకు టిఫిను వచ్చింది. ఆకలిమీద ఉన్నానేమో ఆవురావురుమంటూ మరో ప్లేటు పూరీ కూడా తెప్పించుకుని తినేశాను... బ్రూకాఫీ త్రాగి బ్రేవుమంటూ త్రేన్చాను... సర్వరు బిల్లు తెచ్చి చేతిలో పెట్టాడు...

బిల్లు తీసుకుని కౌంటరు ముందుకు వచ్చాను. కౌంటరు రద్దీగా ఉంది. చుట్టూ జనం ... కౌంటరులో కూర్చున్న వ్యక్తి చెమటలు కక్కుతున్నాడు... నన్ను ఎవరన్నా గమనిస్తున్నారా అని అటూ ఇటూ చూశాను. బిల్లు జేబులో పెట్టుకుని పిల్లిలా బయటకు వచ్చేశాను...విచిత్రం ! నాకు కించిత్‌కూడా బాధలేదు... కడుపు నిండా తిని బిల్లు చెల్లించకుండా వచ్చేయడం తప్పు, మోసం అన్న భావం నాకు ఏకోశానా రాలేదు.

ముష్టిముఖం వల్లనేమో, నా మనస్తత్వంలోనూ దిగజారుడుతనం మొదలయ్యింది...! అయితేనేం...? నాకు ఆనందంగానే ఉంది ! హోటలు ప్రక్క కిళ్ళీకొట్టు దగ్గర ఆగాను... మిఠాయి కిళ్ళీ వేసుకున్నాను... ఓ ఫిల్టరు సిగరెట్టు విలాసంగా వెలిగించాను. కొట్టువాడు నా ముష్టిముఖంలోకి చూశాడు. అతను నన్ను డబ్బులు అడగలేదు. మరో బేరం చూసుకోసాగాడు. ఇంతకు ముందెప్పుడూ నేను డబ్బులు ఇవ్వందే అతను సిగరెట్టు కానీ, కిళ్ళీగానీ ఇచ్చేవాడు కాదు... ఎంతలో ఎంత మార్పు...? నేను ఉల్లాసంగా సిగరెట్టు కాల్చుకుంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాను... ఆఫీసు వరండాలో బీడీ కాల్చుకుంటూ ఎదరయ్యాడు అటెండరు ఏడుకొండలు !

'ఏమోయ్ ! ఏడుకొండలూ ! బావున్నావా...?' నవ్వుతూ పలకరించాను. ఏడుకొండలు నా ముష్టిముఖం వైపు విస్మయంగా చూశాడు...!

"నీతో చిన్న పనుందోయ్ ! ఏంలేదు... ఒక వంద రూపాయలు అప్పుకావాలి... వడ్డీ ఎంతైనా సరే తీసుకో !" అతని భుజం మీద చనువుగా చేయివేశాను. ఏడుకొండలు, నన్నూ, నా నవ్వునీ, నా మాటల్నీ నమ్మలేనట్లుగా చూసి "అలాగేసార్ ! మీరడిగితే కాదంటానా ? అందరి దగ్గరా పదిరూపాయలు వడ్డీ తీసుకుంటున్నాను... మీరు అయిదు రూపాయలే ఇవ్వండి... ఓ గంటలో సర్దుబాటు చేస్తాను... సరేనా !" అన్నాడు.

ఏడుకొండలు వద్ద ఇంతకు ముందెప్పుడూ నేను అప్పు చెయ్యలేదు... అప్పు చేయాల్సిన అవసరం వచ్చినా తప్పించుకున్నాను. ఆర్థిక సమస్యల్ని నాకున్న ఆదాయ పరిధిలోనే పరిష్కరించుకోవడం నాకు అలవాటు... ఇప్పుడు ముష్టిముఖం పెట్టుకోవడంతో, అసంకల్పితంగా ఏడుకొండల్ని అప్పు అడిగేశాను. అతనివద్ద వంద రూపాయలు అప్పు తీసుకుని, సాయంత్రం అలివేలునీ, పిల్లల్నీ

సినిమాకు తీసుకు వెళ్ళాలి... హోటలుకు వెళ్ళి భోజనం చేయాలి... హాయిగా గడిపేయాలి... ఒక నిర్ణయానికొచ్చేశాను. అప్పుచేసి జల్సా చేయడానికి నా మనసు ఉవ్విళ్ళూరుతోంది...!

ఏడుకొండలు చేయిపట్టుకుని ఊపి థేంక్సు చెప్పాను... తిన్నగా నా సెక్షనులోకి నడిచాను... సెక్షనులోకి వెళ్ళి స్థిమితంగా కుర్చీలో కూర్చున్నాను... తలెత్తి నవ్వుతూ చుట్టూ చూశాను... సెక్షనులో అందరూ వింతగా నా ముష్టి ముఖం వైపే చూస్తున్నారు. నా నవ్వు వాళ్ళకు కొత్తగా ఉంది. ఈ నవ్వు నేను తెచ్చిపెట్టుకున్నది కాదు. నా ముష్టిముఖంతో అలంకారంగా వచ్చిందే...!

'ఏంటి ముకుందరావుగారూ ! నాకంటే ముందే వచ్చేసేరే ? మీ అబ్బాయికి ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంకు వచ్చిందటగా ! మీలాంటి మేథావి కడుపున పుట్టాక ర్యాంకు రాకుండా పోతుందా...? అదృష్టవంతుడు. మీవాడికీ నా కంగ్రాట్స్ చెప్పండి!' ఎదురు సీట్లోని ముకుందరావుతో మాటలు కలిపాను... ముకుందరావు ముఖం వికసించింది. ముసిముసిగా నవ్వుకున్నాడు !

నిజానికి ముకుందరావు మేథావి కాదు... మూర్ఖశిఖామణి ! అతనికొడుకు తెలివితేటలతో సీటు సంపాదించనూ లేదు. కొడుకు సీటుకోసం, ముకుందరావు ఏభైవేల వరకూ ఖర్చు పెట్టాడని వినికిడి !.

నా ప్రక్క సీట్లోని సుందరి నా ముఖం వైపు పదే పదే చూస్తోంది ! "సుందరిగారూ ! మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందించాలండీ ! మొన్నటి కాకినాడ సంబంధం నచ్చలేదనీ, మీ బాబాయితో ఖచ్చితంగా చెప్పేశారట... ఆ పెళ్ళి కొడుకు మీరడిగే ప్రశ్నలకు బేజారెత్తిపోయి బావురుమన్నాడట... అయినా మీలాంటి అందగత్తెనీ, ఉద్యోగం చేసుకుంటోన్న ఆడపిల్లనీ పెళ్ళి చేసుకోవడానికి, ఆ కుర్రాడు ఎంతో అదృష్టంతో పెట్టి పుట్టాలి !"

నా మాటలకు సుందరి సిగ్గుపడింది. మెలికలు తిరిగింది ! సుందరిని అందగత్తె అనడం ఖచ్చితంగా ఆత్మవంచనే ! ఆమె కారునలుపులో ఉంటుంది. పైగా మెల్లకన్ను... జుట్టు కూడా తెల్లబడింది... ఆమెకు పెళ్ళి చేసుకునే వయసు ఎప్పుడో దాటిపోయింది... ఆ కారణంగానే సుందరికి సంబంధాలు తప్పిపోతున్నాయి...

నా మనస్తత్వంలోని మార్పు నాకు స్పష్టంగా అర్ధమవుతోంది ! మొత్తం మీద, సెక్షనులో ఉన్నవాళ్ళందర్నీ నా ముష్టిముఖం ఆకర్షించింది ! కావాలని పలకరించడం, మెప్పుకోలుగా మాట్లాడడం వాళ్ళకు సంతృప్తినిచ్చింది. ముకుందరావు నన్ను కేంటీనుకు తీసుకుపోయి టీ ఇప్పించాడు... పరబ్రహ్మం సిగరెట్టు కాల్చమని పట్టుబట్టాడు. వెంకట్రావు నా చేతిలో వక్కపొడి పలుకులు వేశాడు... సుందరి తన టిఫిను బాక్సులోని బొబ్బట్టు తినమని బలవంతం చేసింది. లంచ్ అవర్‌లో ఏడుకొండలు వందరూపాయలు అప్పు తీసుకొచ్చి ఇచ్చాడు... నాలో కొత్తశక్తి, ఉత్సాహం చోటు చేసుకున్నాయి. కొత్త ఊహలు, కోరికలు, నాకు భవిష్యత్తు మీద ఆశను కల్పించాయి !.

నేను మా ఆఫీసరు రామ్మూర్తి రూములోకి వెళ్ళాను... రెండు చేతులూ జోడించి ఆయనకు నమస్కారం పెట్టాను. గతంలో ఎప్పుడూ రామ్మూర్తికి నేను చేయెత్తి నమస్కారం పెట్టలేదు... రామూర్తి అంటే నాకు అసహ్యం... కోపం ! రామ్మూర్తికి ఇద్దరు పెళ్ళాలు, ఒక ఉంపుడుకత్తె ఉన్నారు... వాళ్ళు చాలక మరదల్ని కూడా పాడుచేశాడని, ఊరంతా పుకారు ఉంది... తాగుబోతు... లంచగొండి... జూదరి... అతనికి లేని వ్యసనం లేదు...

నేను నమస్కారం పెట్టననీ, నా పని సక్రమంగా చేసుకుంటున్నా నన్ను చీటికీ మాటికీ చీవాట్లు పెడుతూండేవాడు... ఏవో కారణాలు ఎత్తి చూపించి మెమోలు, ఛార్జిషీట్లు ఇప్పించేవాడు ! నేనిప్పుడు ఒంగిపోయి, రెండు చేతులూ జోడించడం, ఆయనకు చాలా ఆశ్చర్యంగా కలిగించిందేమో కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు.

ఏంటి సంగతీ అంటూ నా ముష్టిముఖంలోకి సూటిగా చూశాడు !

"ఏం౦ లేదుసార్ ! సకల గుణాభిరాముడు, శ్రీరాముడు మీ పేరులో ఉన్నాడు ! మీది దొడ్డ మనసు... దొరల వంశంలోంచి వచ్చారు తమరు ! నన్ను కరుణించాలి... ఏదో పిల్లలు కలవాడ్ని... జీతం చాలక నానా ఇబ్బందులు పడుతున్నాను... మూడేళ్ళ క్రితమే నాకు ప్రమోషన్ రావాల్సి ఉంది... నా కంటే జూనియరు, భానుమూర్తికి మొన్ననే ప్రమోషన్ ఇచ్చారు... నీతికి నిజాయితీకి నిలువుటద్దం లాంటిది మీ వ్యక్తిత్వం... నాకు న్యాయం చేయాలి... ఈ సారి ఎలాగైనా నాపేరు సిఫార్సు చేసి పుణ్యం కట్టుకోవాలి... మీ మేలు జన్మలో మర్చిపోను !"

నా గొంతులో ధ్వనించిన దీనత్వం... దాసోహం అంటూ నిలడ్డ తీరు... మా ఆఫీసరు రామ్మూర్తికి ఎంత ఆనందం కలిగించిందో ఏమో, అతగాడి ముఖం ప్రసన్నంగా మారింది !

"ఈ నెలలో మీ పేరు రికమెండ్ చేస్తాన్లెండి... బుద్ధిగా, అణకువగా పనిచేసుకోండి ! వెళ్ళండి !" అంటూ ఫైల్లో ముఖం దాచుకున్నాడు... నేను రామ్మూర్తికి మరో నమస్కారం పడేసి గాల్లోంచి తేలివచ్చినట్లుగా గదిలోంచి బయటకు వచ్చేశాను. సీటులో కూర్చున్నానేగానీ లాటరీలో పది లక్షలు గెలిచినంత థ్రిల్లుగా ఉంది నాకు ! ప్రమోషన్ అంటే మాటలా ? సీటు మారుతుంది. చోటు మారుతుంది. జీతం పెరుగుతుంది... హోదా, గౌరవం పెరుగుతాయి ! ముష్టిముఖం వల్ల. ఎన్ని లాభాలు సుఖాలు నన్ను వరిస్తున్నాయి...?

అయిదు గంటలవరకూ చాలా ఉత్సాహంగా పనిచేసి ఆఫీసు నుంచి బయటపడ్డాను. అప్పుచేసిన వందరూపాయలు జేబులో ఉన్నాయి. అడుగులు గాలిలో తేలిపడుతున్నాయి. నా భార్య కోసం రూపాయి మల్లెపూలు కొన్నాను. మల్లెపూలు అమ్మే మామ్మ రూపాయి తీసుకోలేదు... నా ముష్టిముఖం వైపు చూసి "వద్దులే బాబు... నీ దగ్గర డబ్బులు తీసుకోవడం ఏంటీ !" అంది. నేను ఆశ్చర్యపడలేదు. అంతా నా ముష్టిముఖం ప్రభావమే. పిల్లల కోసం మిఠాయి బూందీ పొట్లాం కట్టించాను. ఆ దుఖాణం వాడూ నా ముష్టిముఖంలోకి చూస్తుండిపోయాడు. నాకెంతో ధైర్యం వచ్చింది. నా నమ్మకం బలపడింది. నాకింక తిరుగులేదు. ఈ ముష్టిముఖంతో నేను ఏదైన సాధించగలను. నా భార్య పిల్లల్ని సుఖపెట్టగలను. జీవితాంతం నేను సుఖంగా, హాయిగా జీవించగలను...

ఇల్లు దగ్గరపడింది. నాలో ఆనందం అణువణువునా పెల్లుబుకుతోంది ! అలివేలునీ, పిల్లల్నీ సినిమాకు తీసుకువెళ్ళాలి. అలివేలు ఎంత సంబర పడిపోతుందో !

"ఏవండోయ్ ! మిమ్మల్నే !"

ఎవరైనా నన్ను పిలుస్తున్నారా ? నేను వెనక్కి తిరిగాను. ఎవరూ లేరు !

"మిమ్మల్నేనండి బాబూ ! ఆగండి...!" మళ్ళీ ఎవరో పిలిచారు. తలతిప్పి చూశాను. దూరంగా రోడ్డు పక్క చెట్టుకింద నుంచి ఒక వ్యక్తి నావైపు వస్తున్నాడు. నేను నివ్వెరపోతూ నిలబడ్డాను. అతను నా వద్దకు వచ్చాడు.

"ఏదిబాబూ ! మీ సెయ్యిటియ్యండి..."

నేను చేయి సాచాను. అతను నా చేతిలో పదిపైసలు బిళ్ళ వేశాడు. నాకు నోట మాట రాలేదు. ఆ వ్యక్తి ప్రొద్దుట బజారులో నాకెదురయిన ముష్టివాడు...!

"ఆ పదిపైసల బిళ్ళ తవరిచ్చిందేనయ్యా... ఈ దినం, సంపాదనంతా ఆ బిళ్ళే బాబు. పొద్దుట్నుంచీ ఎపుడూ నా మొకం సూడనేదు... ముష్టివెయ్యనేదు... ఆకలితో మాడిపోయానయ్యా... కడుపు కాలిపోయింది. తవరికోసం ఈదులన్నీ తిరిగాను. ఎతకని సందులేదు. గొందులేదు. వద్దు బాబయ్యా ! మీ మొకం నాకొద్దు. నా మొకం నాకిచ్చియ్యండి... ఇచ్చియ్యండి !" ముష్టివాడు నా మీద మీదకు వస్తూ గోలపెట్టసాగాడు... నాకు ముచ్చెమటలు పోశాయి !

"ఈ ముష్టిముఖాన్ని తిరిగిచ్చేయడమా ? అమ్మో దీనివల్ల ఎన్ని లాభాలున్నాయి ? ఎన్ని సుఖాలున్నాయి ? ఈ ముష్టిముఖాన్ని పెట్టుకుని భవిష్యత్తు ఎంత అందంగా ఊహించుకున్నాను ? ఊహూఁ నేనివ్వనుగాక ఇవ్వను. నాకీ ముఖమే బావుంది...!" నేను సణుక్కుంటూ ఒక అడుగు వెనక్కి వేశాను !

"ఏటి బాబూ ! నా మొకాన్ని నాకివ్వవా ? నా ముష్టిమొకమే నీకు గావాలా ? నీకు సిగ్గూ, లజ్జా నీ ఒంట్లో సీవూ, నెత్తురూ లేవేంటి...? నా మొకాన్ని నువ్వెట్టుకుంటే నేనేటి గావాలా ? నా బత్కునేటి గావాలా ?"

ముష్టివాడు వేటకుక్కలా నా మీదకు దూకాడు. ఎలుగుబంటిలా నాతో కలియబడ్డాడు. నేను 'వద్దు ! వద్దు !' అంటూ నా శక్తి కొద్దీ ముష్టివాడితో పెనుగులాడబోయాను. కానీ వాడు నన్ను క్రింద పడగొట్టేశాడు. విసురుగా ముష్టిముఖాన్ని లాగేసుకుని నా ముఖాన్ని నాకు తగిలించేశాడు...

నేను గట్టిగా అరిచాను. వాడు పారిపోతున్నాడు. వాడ్ని పట్టుకోబోయి దబుక్కున రోడ్డు పక్క గోతిలో పడిపోయాను...

ఎలా ఇప్పుడు ? నేనేం చేయాలి ? ఏం చేయాలి ?

వాడ్ని పట్టుకోండి... పట్టుకోండి...

"ఏవండీ ! మిమ్మల్నే !"

తుళ్ళిపడి కళ్ళు తెరిచాను. ఎదురుగా నా భార్య అలివేలు !

"వాలు కుర్చీలో పడుకుని, పట్టపగలే పలవరిస్తున్నారేమిటి ? ఏం చెయ్యాలీ ? ఏం చెయ్యాలీ ? పట్టుకోండీ ! అంటున్నారు. కిరాణా కొట్టుకు వెళ్ళి బియ్యం, సామాన్లు తీసుకు రమ్మన్నాను కదండీ !' వంట గదిలోంచి వచ్చి అర్ధాంగి నిలదీసి అడుగుతోంది !

నేను నా ముఖాన్ని తొట్రుపాటుతో తడుముకున్నాను. అద్దంలో చూసుకున్నాను. అది నా ముఖమే...! ముష్టిముఖం కాదు ! ఇంతకుముందే, అలివేలు ఒకసారి వంటగదిలోంచి అరిచింది కిరాణా కొట్టుకు వెళ్ళమనీ ! ఆ షాహుకారు కొట్టుకు వెళ్ళి అరువు అడగాలంటే నాకు అడుగు ముందు పడదు... గొంతులోకి ఏదో అడ్డం వచ్చినట్లుగా ఉంటుంది...! అందుకే ఆలోచనగా కుర్చీలో వాలి కళ్ళు మూసుకున్నాను. కళ్లు మూసుకోగానే చిన్న కునుకు పట్టింది. ఆ కునుకులో 'ముష్టిముఖం' కనిపించింది. అది నన్ను మురిపించింది. మైమరపించింది.

ముష్టిముఖాన్ని తగిలించుకోవడం అంటే తాత్కాలికంగా మనసును చంపుకోవడం... వ్యక్తిత్వాన్ని వదులుకోవడం... ప్రతిదానికీ పరిధిని మించి ప్రాథేయపడిపోవడం... తమ అవసరాలకోసం ఎదుటివాళ్ళని ఇంద్రుడూ-చంద్రుడూ అంటూ పొగడటం... నాకు ముష్టిముఖం అంటే అసహ్యం !

కానీ, నాలాంటి మధ్య రకం మనిషికి - అవసరాలు గట్టెక్కాలంటే అప్పుడప్పుడూ ముష్టిముఖాన్ని తగిలించుకోక తప్పదేమో !

"వెళ్ళక తప్పదంటావా ?" ముష్టిముఖాన్ని నెమరు వేసుకుంటూ కుర్చీలోంచి భారంగా పైకి లేచాను.

"వద్దులెండి ! మీరు వెళ్తే ఆ షాహుకారు సరుకు లివ్వడేమో ! మీ సుపుత్రుడు స్కూలు నుంచి రాగానే వాడ్ని తోడు తీసుకుని వెళ్ళి సరుకులు నేనే తెచ్చుకుంటాను... ఈ పూటకు పక్కింటి పిన్నిగారు, అవసరానికి ఆదుకున్నారు... వంట చేశాను... వచ్చి భోజనం చెయ్యండి !" అలివేలు వంటగదిలోకి వెళ్ళింది !

"థాంక్యూ ! శ్రీమతీ ! నీలాంటి అర్ధాంగి దొరకడం, నాఅదృష్టం...

ఎప్పటికప్పుడు 'ముష్టిముఖాన్ని తగిలించుకునే అవసరాన్ని తప్పిస్తుంటావు !"

అలివేలు వెంట నేనూ నడిచాను ఆనందంగా!

ఈనాడు ఆదివారం అనుబంధం
2-5-93